క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీలు



కడియంలో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న చిన్నారులు

కడియం: స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ శెట్టి పల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంలో రామాయణంలోని వివిధ ఘట్టాలను రిషిత వివరించింది. ఎస్.భా స్కర్ గురుశిష్యుల కథలు, సీహెచ్ వెంకటేశ్వర్లు పురాణ కథలు, కె.ప్రసాద్ పేపర్ క్రాఫ్టవర్క్, సురేష్ సోషల్ సబ్జెక్టుపై చిన్నారులకు అవగాహన కల్పించారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



దుళ్ల కాలనీలో విరిగిపడిన కొబ్బరి చెట్టు

కడియం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు తీవ్రమైన ఎండతో సతమతమైన జనం.. వాన చినుకులు మొదలవ్వగానే కాస్తంత ఉపశ మనం పొందారు. చూస్తుండగా భారీవర్షంగా మారింది. జేగురుపాడు, మాధవరాయుడుపా లెం, మురమండ, వీరవరం, దుళ్ల తదితర గ్రామాల్లో వర్షం ముంచెత్తింది. వీరవరం మెయిన్ రోడ్డుపై భారీ చెట్టు పడిపోయింది. విద్యుత్ తీగల మీద పడిపోవడంతో ఆ చెట్టు తొలగింపు పనులను సిబ్బంది వెంటనే చేప ట్టారు. దుళ్ల బీసీ కాలనీలో కొబ్బరి చెట్టు విరిగి పక్కనే ఉన్న ఇంటిపై పడింది. అదృష్టవశాత్తూ ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం లేదని స్థానికులు తెలిపారు. ఆయా గ్రామాల్లో కూడా పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కాగా కడియం ,కడియపులంక గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి.

రైళ్ల రాకపోకలు ఆలస్యం

రాజమహేంద్రవరం సిటీ: సాంకేతిక లోపం కారణంగా రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు శని వారం ఆలస్యంగా నడిచాయి. సామర్లకోట సమీపంలో రైల్వే విద్యుత్తు లైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో ఆ ఆలస్యం జరిగింది. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటల ఆలస్యంగా సాయంత్రం 6.30కు వచ్చింది. మధ్యాహ్నం 3.20 గంటలకు రావాల్సిన యశ్వంత్‌పూర్ రాత్రి 7.15 గంటలకు, అలాగే సాయంత్రం 4.40 గంటలకు రావాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రాత్రి 7 గంటలకు చేరుకుంది. తిరుమల ఎక్స్ ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7.35 గంటలకు, శేషాద్రి ఎక్స్‌ప్రెస్ గంటల ఆలస్యం గా రాత్రి 7.30 గంటలకు చేరుకున్నాయి.

జీవన నైపుణ్యాలపై అవగాహన



యోగాసనాలు నేర్పిస్తున్న లలితా సుందరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జీవన నైపుణ్యాలపై అవగాహన పెంచుకో వాలని జనార్దనరావు మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు సాధు వెంకట కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమ హేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. యోగా గురువు లీలా సుందరి సులభ వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణామయం, సూర్య నమ స్కారాలు నేర్పించారు. పార్వతీ పరమేశ్వర రైస్‌స్టోర్స్ అధినేత పాలసానపల్లి రాజశేఖర్, లక్ష్మీ హార్డ్‌వేర్ అధినేత మద్దుల చైతన్య మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేశారు. లైబ్రేరియన్ శ్రీదేవి పాల్గొన్నారు.

పాస్టిక్ నిషేధంతో పర్యావరణ రక్షణ

మధురపూడి: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని అటవీశాఖ దివాన్ చెరువు సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి పద్మావతీదేవి అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కోరుకొండ మండలం నిడిగట్లలో ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవ గాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడమే జీవనశై లిగా అలవర్చుకోవాలన్నారు. నీటి సంరక్షణ ద్వారా తాగునీరు వృథాకాదన్నారు. ఇంధ నాన్ని పొదుపుగా వాడకపోవడంతో కొరత ఏర్పడుతోందని, ఇది సమాజ వికాసానికి ఆటంకమవుతోందన్నారు. అనంతరం నిడిగట్ల సచివాలయం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చారు. ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అట వీశాఖ బీట్ ఆఫీసర్ జీవీ రంగారావు, అసిస్టెం ట్ ఆఫీసర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

చురుకుగా సిల్ట్ తొలగింపు పనులు

- వర్షాకాలం రాకముందే పూర్తి చేసేలా ప్రణాళిక
- కమిషనర్ ప్రత్యేక దృష్టి



కాలువలో పూడికలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ: నగరంలోని ప్రధాన కాలువల్లో పూడిక తీత (సిల్ట్ తొలగింపు) పనులు చురుగ్గా సాగుతు న్నాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. నగరంలోని డ్రైనేజీల వల్ల వేసవిలో పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ వర్షాకాలం వచ్చిం దే చాలు వీధుల్లోని కాలువలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడతారు. దీనికి ప్రధాన కారణం అవి చాలా చిన్నవిగా ఉండడం, కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరడం. వాటి నుంచి నీరు పొంగిపార్లి రోడ్లపై ప్రవహిస్తోంది. అయితే నగరంలో ప్రధాన కాలువ లను నూతనంగా నిర్మించడం వల్ల ఇప్పుడు వర్షం వల్ల ఇబ్బంది తప్పింది. ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లోని సిల్ట్‌ను తొలగించడం వల్ల ప్రధాన కాలువలలో నీరు నిలిచిపోయే అవకాశం తగ్గింది. కానీ వీధుల్లో ఉన్న చిన్న కాలువల్లో ప్లాస్టిక్ బాటిల్, కొబ్బరి బొం డాలు తదితర వ్యర్థాలను పారవేయడం వల్ల నీరు నిలిచిపోతోంది.

డీసిల్టేషన్ ప్రక్రియ వేగవంతం

నగరంలోని నల్లా చానల్, కంబాల చెరువు వద్ద కాలువ, కోటిపల్లి బస్టాండ్, కుమారి టాకీస్ రోడ్డు, గోదావరి గట్టు, దేవీచౌక్, తుమ్మలావ, ఆవరోడ్డు, షెల్టన్ తదితర ప్రాంతాలలోని మేజర్ డ్రైనేజీల్లో సిల్ట్‌ను తొలగించడానికి కార్పొరేషన్ డీసిల్టేషన్ ప్రక్రి యను వేగవంతం చేసింది. వర్షాకాలం రాకముందే మేజర్ డ్రైనేజీల్లో సిల్ట్‌ను తొలగించడానికి కార్పొరే షన్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతోంది. కాలువలతో పాటు మ్యాన్‌హోల్ ఉన్నచోట కూడా సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. దీనికోసం శానిటేషన్ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీలో తీసిన పూడికను ఎప్పటికప్పుడు టిప్పర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

కమిషనర్ పరిశీలన

రెండు రోజులుగా నగరంలోని డ్రైనేజీల్లో జరుగు తున్న పూడికతీత పనులను కమిషనర్ దినేష్ కుమార్ పరిశీలిస్తున్నారు. శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు ఇస్తున్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే కాలువల్లో సిల్ట్‌ను తొలగించాలని ఆదే శాలు ఇచ్చారు.

శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాసరావు, మున్సి పల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. స్థానిక శ్రీకన్య హోటల్ నుంచి సితార హోటల్ వరకూ పెద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ ఉంది. ముందుగా ఇక్కడ సిబ్బందితో పూడికతీత పనులను ప్రారంభించారు. మెషీన్ ద్వారా మేజర్ డ్రైనేజీల్లో సిల్ట్ తీసే ప్రక్రియను ఆదివారం నుంచి ప్రారంభించనున్నారు.

పనులు వేగవంతం

వర్షాకాలం మొదలవ్వక ముందే మురుగు కాలువల్లో సిల్ట్ తొలగించే ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలనే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ఈ పనులు చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లి, దుర్గంధం రాకుండా శానిటేషన్ సిబ్బంది చర్యలు తీసుకుంటు న్నారు.

– దినేష్ కుమార్,
కార్పొరేషన్ కమిషనర్,
రాజమహేంద్రవరం

పేదలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

- ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం దారుణం
- ఎంపీ భరత్‌రామ్
- ఆజాద్ చౌక్ సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: పేదల ఇంటి స్థలాలను సమాధులతో పోల్చిన చంద్రబాబు.. రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆజాద్ చౌక్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ధర్నా నిర్వహించారు. నల్ల జెం డాలతో ర్యాలీ చేసి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. పేదల ద్రోహి చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశాయి. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలనే మహా సం కల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి స్థలాలు పంపిణీ చేశారన్నారు. వాటిలో ఇళ్లు కట్టుకో వడానికి రుణాలు ఇచ్చారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఎంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారో, ఎన్ని ఇళ్లు కట్టించారో తెలపాలని డిమాండ్ చేశారు. అమరావతిలో 55 వేల మందికి సీఎం జగన్ ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని, దీన్ని కూడా ఏదో విధంగా రాద్ధాంతం చేయడానికి చంద్రబాబు ప్రయత్నిస్తు న్నారన్నారు. ఇళ్ల స్థలాలను సమాధులుగా పోల్చు తున్న ఆయనకు పేదల పట్ల ఎంత చులకన భావం ఉందో అర్థమవుతోందన్నారు. ఒక్కో పేదవాని ఇం టి కోసం రూ.8 లక్షలకు పైగా రాష్ట్ర ప్రభుత్వం వెచ్చి స్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మజ్జి అప్పారావు, మజ్జి నూకరత్నం , గుర్రం గౌతమ్, పీతా రామకృష్ణ, బర్రే కొండ బాబు, హబీబుల్లా ఖాన్, అన్నపూర్ణ రాజు, నందం స్వామి, నల్లా రామాంజనేయులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి
- ఫిష్ ఆంధ్ర స్టాల్ ప్రారంభం



స్టాల్‌ను ప్రారంభించిన షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మత్స్యకారుల సంక్షేమా నికి, అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపె ట్టిందని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో వెలమ లక్ష్మణరావు, లక్ష్మి ఆధ్వర్యంలో వి.సాయిప్రియ గోదావరి గట్టున ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర స్టాల్‌ను శనివారం ఆమె ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ స్టాల్ ఏర్పాటు చేసుకోవడానికి రూ.3.22 లక్షలు మంజూ రైందని, 40 శాతం సబ్సిడీ ఇచ్చారన్నారు. జగనన్న ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాలా భరోసా ఇస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణారావు, రాజమ హేంద్రవరం డెవలప్‌మెంట్ ఆఫీసర్ బ్రహ్మానందం , సిబ్బంది సూర్య, సంధ్య, వైఎస్సార్ సీపీ నాయ కులు గుదే రఘునరేష్, బూడిద శరత్ కుమార్ పాల్గొన్నారు.

చెత్త ఉత్పత్తిని తగ్గించడమే ఆర్‌ఆర్‌ఆర్ లక్ష్యం



ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర వాసులు ఉపయోగిం చని ప్లాస్టిక్, పాత పుస్తకాలు, దుస్తులు, చెప్పులు వం టి వాటిని నగరంలో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాలలో అప్ప గిస్తే, వాటిని రీసైక్లింగ్ విధానంలో తిరిగి వినియోగం లోకి తీసుకుని వచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు నగర కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. మేరీ లైఫ్ స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా బైపాస్ రోడ్డులో సంజీవని మెడికల్ షాపు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన మొదటి ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని శని వారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో ఆర్‌ఆర్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాత బట్టలు, ప్లాస్టిక్ బొమ్మలు వంటి వాటిని ఈ కేంద్రా లలో అప్పగించాలన్నారు. ఇలా సేకరించిన వస్తువు లను పర్యావరణహితంగా వినియోగంలోకి తీసుకువ స్తామన్నారు. నగర వ్యాప్తంగా చెత్త ఉత్పత్తిని తగ్గిం చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రెడ్యూస్ – చెత్త ఉత్పత్తిని వీలైనంత తగ్గించడం, రీయూజ్ – చెత్త ఉత్పత్తికి కారణమయ్యే వస్తువులను కాలపరిమితి పూర్తి అయ్యేంతవరకు ఉపయోగించడం, రీసైకిల్ – ఆ వస్తువులను పునరుత్పాదన చేయడం వంటి చర్యలు ఈ కేంద్రాల ద్వారా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం లో శానిటరీ సూపర్ వైజర్ ఇంటి శ్రీనివాస్, శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి అన్నమయ్య, డివైన్ మేనేజర్ లావణ్య పాల్గొన్నారు.

భూములను అప్పగించాలని వినతి



ఆర్డీఓ కార్యాలయం వద్ద సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: ఆక్రమణకు గురవుతున్న తమ సంఘం భూములకు రక్షణ కల్పించి, తమకు అప్పగించాలని జమాతుల్ ఖురేష్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సంఘ అధ్యక్షుడు అబ్దుల్ వాహెద్, సెక్రటరీ అబ్దుల్ వహీమ్, హమీదుల్లా మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట పంచాయతీ పరిధిలో 2.40 ఎకరాలు ఉం డగా, సర్వే నెంబర్ 1095/3లో 91 సెంట్ల భూమికి అధికారులు తప్పుడు పత్రాలు సృష్టించి సయ్యద్ ఫయాజ్ ఉద్దీన్ పేరిట మార్పి ఫారమ్ 1బి ఇచ్చారని ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పత్రాలు మార్చి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సదరు రికార్డులను రద్దు చేయాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టగా.. ఆర్డీఓ వారిని నివేదిక ఇవ్వాలని కోరినట్టు వివరిం చారు. తమ సంఘానికి చెందిన భూమిని ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు పత్రాలు సృష్టించిన అధికారులు, తమ భూములను కాజేయాలని చూసిన వారిపై తక్షణం చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహ్మద్ అమానుల్లా, మహ్మద్ ఫైజుల్లా పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లకు అవార్డులు అందజేసి, సత్కరించిన దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదల ముగింటకు చేర్చుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ 3వ డివిజన్ ఇన్‌చార్జి బళ్లా సత్యవతి కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం లో భాగంగా శనివారం స్థానిక మూడో డివిజన్ వలంటీర్లకు సచివాలయంలో సేవావజ్ర, సేవా రత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బళ్లా సత్యవతి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. బళ్లా శ్రీనివాస రావు, మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి మణికంఠ, సచివాలయం సిబ్బంది, గృహసారథులు, బళ్లా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు కట్టుదిట్ట చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ ఐజీ రాజారామ్

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికులకు అత్యంత కట్టుదట్టమైన భద్రత కల్పించేందుకు సిబ్బం ది నిరంతరం కృషి చేయాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌ఫీఎఫ్) ఐజీ రాజారామ్ అన్నారు. సురక్షా సమ్మే ళన్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలోని అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయంలో శని వారం ఆర్‌పీఎఫ్ సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే ప్రయాణి కుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎక్కువ సార్లు స్పెషల్ రైడ్స్ చేయాలని, రైల్వేస్టేషన్‌లో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆర్‌ఓబీ, ఎఫ్ఓ బీల వద్ద నిఘా పెంపుదల చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. స్టేషన్ ఆవరణలోని నోపార్కింగ్ ఏరియాలు ఎప్పటికప్పుడు క్లియర్‌గా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనం తరం ఆర్‌ఫీఎఫ్ బ్యారక్‌ను పరిశీలించారు. కార్య క్రమంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు క్షేమంగా బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగించిన జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన 12 ఏళ్ల బాలుడిని రాజమహేంద్రవరం జీఆర్పీ పోలీసులు శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గుడివాడకు చెం దిన 12 ఏళ్ల గుమ్మల తంబిబాబు ఇంటి నుంచి పారిపోయి గోదావరి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతుండగా జీఆర్పీ పోలీసులు ఆ బాలుడిని విచారించారు. అతడి వద్దఉన్న సెల్‌ఫోన్‌తో తల్లిదండ్రులతో మాట్లాడారు. రెండు రోజులుగా బాలుడి ఆచూకీ కోసం వెతుకుతున్నామని వారు చెప్పారు. అనం తరం తండ్రి జోసఫ్ రాజమహేంద్రవరానికి రావాలని చెప్పి, వివరాలు ధ్రువీకరించుకున్న అనం తరం బాలుడి అప్పగించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు.

వ్యక్తిపై భార్య, ఆమె బంధువుల దాడి

సీతానగరం: వ్యక్తిపై భార్య, ఆమె బంధువులు దాడి చేసిన ఘటనపై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి సమచారం మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరానికి చెందిన ఆకేటి సురేష్, మల్లేశ్వరి భార్యాభర్తలు, వీరిమధ్య కొం త కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మల్లేశ్వరి ఉండేశ్వరపురంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చేసింది. సురేష్ వచ్చి రాజమహేంద్రవరంలో కాపురం ఉందామని చెప్పగా.. రెండు నెలల తర్వాత వస్తానంది. గడువు ముగిసిన తర్వాత ఈనెల 17న సురేష్ ఉండేశ్వరపురంలో భార్య దగ్గరకు వచ్చి కాపు రానికి రావాలని అడిగాడు. మల్లేశ్వరి, ఆమె బంధు వులు కలిసి సురేష్‌పై దాడి చేశారు. రాజమహేంద్ర వరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఆ ఆస్పత్రి నుం చి వచ్చిన సమాచారం మేరకు కాయన సత్యనారా యణ, ఆకేటి మల్లేశ్వరి, సానా చాముండేశ్వరి, మేడిం లక్ష్మి, సానా కుమారిపై కేసు నమోదు చేశారు.

టంగుటూరికి నివాళి

ప్రకాశం నగర్: ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో శనివారం కోటిపల్లి బస్టాండ్ వద్ద గల స్వాతంత్య్ర సమరయోధుల పార్కులో టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితి కార్యదర్శి కదలి ఏడుకొండలు, నవోదయ చిన్న వర్తకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ దొంగకు ఆరు నెలల జైలు

సీతానగరం: మోటారు సైకిల్ దొంగతనం కేసులో విశాఖపట్నానికి చెందిన మకాల ధనకుమార్‌కు ఆరు నెలలు జైలు విధిస్తూ రాజమహేంద్రవరం అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి కోర్టు మేజి స్ట్రేట్ పి.బాబు తీర్పుచెప్పారు. 2022 జూలై 7న రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామ నగర్‌లో మోటారు సైకిల్‌ను ధనకుమార్ దొంగతనం చేశాడు. ఆ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర రావు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహాలక్ష్మి కేసును వాదించారు. దొంగతనం కేసు రుజువైనందున పైవిధంగా మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. దర్యాప్తు అధికారి హెడ్ కానిస్టేబుల్ వెంక టేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ ఎస్కే బీఎం షరీఫ్‌ను కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమామ హేశ్వరరావు అభినందించారు.

సంచార ముస్లింలను ఆదుకోవాలి

కడియం: ముస్లింలలో అత్యంత వెనుకబడిన వర్గాలైన నూర్‌బాషా, దూదేకుల, మోళీ సాయిబులుగా పిలవ బడే సంచార ముస్లింలను ఆదుకోవాలని టీడీపీ నాయకుడు షేక్ సుభాన్ డిమాండ్ చేశారు. టీడీపీ బీసీ పోరుబాట కార్యక్రమాన్ని మండలంలోని వేమగిరి రాజీవ్ నగర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సుభాన్ మాట్లాడుతూ ఇళ్లకు పర్మినెంట్ పట్టాలు ఇవ్వాలని, షాదీతోఫా అందించాలని కోరారు. కార్యక్రమంలో నూర్‌బాషా సమితి సభ్యులు షేక్ మీరా, షేక్ మదీనా, టీడీపీ నాయకులు చాన్‌బా షా, షేక్ మహబూబ్ జానీ పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వసుంధర

కంబాలచెరువు: హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, అటువంటి మరణాలు భవిష్యత్తులో పునరావృతం కాకూడదని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ కంట్రోలింగ్ (డీఎల్ఏటీ బీ) అధికారి డాక్టర్ ఎన్.వసుంధర అన్నారు. ఆది వారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్‌డే ర్యాలీ నిర్వహణ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఆ ఏర్పాట్లపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డాక్టర్ వసుంధర మాట్లా డుతూ హెచ్ఐవీ మరణాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని యాంటీ రిట్రో వైరల్ ట్రీట్‌మెంట్ సెంటర్ నుంచి కంబాల చెరువు వరకూ ర్యాలీని నిర్వహిస్తామన్నారు. హెచ్ఐవీ నియంత్రణపై ప్రజ లకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో జిల్లా న్యూక్లియర్ ఆఫీసర్ డాక్టర్ పి.లక్ష్మీదేవి, ఏఆర్టీ సెంటర్ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ యూజీ కిరణ్, డాక్టర్ శిల్ప, ఎన్జీవో ప్రతినిధులు, ఏఆర్టీ సెంటర్ సిబ్బంది, ఎల్ఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ అధికారుల సంఘం అధ్యక్షుడిగా జాన్‌వెస్లీ



రాజమహేంద్రవరం రూరల్: ఓఎ న్‌జీసీ అధికారుల సంఘం రాజ మహేంద్రవరం ఎసెట్, కేజీపీజీ బేసిన్ అధ్యక్షుడిగా జాన్‌వెస్లీ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా గ్యాస్‌దిన్, సెక్రట రీగా రామ్మోహన్, జాయింట్ సెక్రటరీగా హరిప్రసాద్, కోశాధికారిగా నాగరాజును ఎన్నుకున్నారు. జాన్‌వెస్లీ నేతృత్వంలో అధికారుల బృందం ఓఎన్‌జీసీలో వివిధ విభాగాలను సమ న్వయం చేసుకుంటూ ఉద్యోగుల వేతన సవరణ, సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, భద్రత నిర్వహ ణలో కీలకపాత్ర పోషిస్తోంది. గత 15 సంవత్సరా లుగా ఢిల్లీలో అధికారుల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన జాన్‌వెస్లీ అధికారుల మన్ననలను అందుకు న్నారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ బృందాన్ని అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్, బేసిన్ మేనేజర్ కరవణ న్, మానవ వనరుల బృంద అధిపతి నవేద్‌రావు, ఇతర సీనియర్ అధికారులు ఘనంగా సన్మానించారు. అలాగే ఓఎన్‌జీసీ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఓఎన్‌జీసీ దక్షిణ భారత పెట్రోలియం ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ సురేష్, రాజమహేంద్రవరం ఎసెట్ సెక్రటరీ ప్రశాంత్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ వైఎస్ రావు, సెక్రటరీ జగన్నాథరావు, ఓబీసీ అసోసియేషన్ చైర్మన్ ఆవుల శ్రీనివాసరావు, ఉమెన్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షురాలు సుహాసిని, ఉద్యోగులు అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: మార్షల్ ఆర్ట్స్, ఉషు జాతీయ పోటీలకు వెళుతున్న 16వ డివిజన్‌కు చెం దిన భారతికి శనివారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందించారు. ఇటీవల నెల్లూరులో జరిగిన మార్షల్ ఆర్ట్స్, ఉషు పోటీలలో జిల్లా నుంచి 15 మంది పాల్గొనగా, అందులో ఒక అమ్మాయి, నలు గురు అబ్బాయిలు ఎంపికయ్యారు. డిగ్రీ పూర్తిచేసి, వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న భారతి జాతీయ పోటీలకు పుణె వెళ్లిరావడానికి, వసతి సదుపా యాల కోసం చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందించారు. మార్షల్ ఆర్ట్స్ కోచ్ నాగమోహన్, భారతి మిత్రబృందం పాల్గొన్నారు.

ప్రైవేటు కన్నా ప్రభుత్వ విద్యాలయాలు మిన్న

రంగంపేట: కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల కన్నా ప్రభుత్వ విద్యాలయాలు మిన్న అని ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ శనివారం మండలంలో క్యాంపెయిన్ నిర్వ హించి ఆయన మాట్లాడారు. 2022–23 విద్యా సంవ త్సరంలో తమ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని వివరించారు.

బిక్కవోలు: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నామని మెళ్లూరు ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పడాల కాశీవిశ్వనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. నిష్ణాతులైన అధ్యాపక బృందంతో తమ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందన్నారు.